- మళ్లీ ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- వెంటనే బాధ్యతల స్వీకరణ
- మహిళా కమిషన్ చైర్మన్‌గా నేరెళ్ల శారద?
- ఉమ్మడి జిల్లా నుంచి అయిత ప్రకాశ్‌రెడ్డి, జనక్‌ప్రసాద్‌కు అవకాశం



సుడా 'పీఠం' నరేందర్ రెడ్డిదే..

బాధ్యతలు స్వీకరిస్తున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (సుడా) చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఈ నియామకాన్ని చేస్తూ మార్చి 15న జీవో ఆర్‌టీ 445 జారీకాగా ఎన్నికల కారణంగా పెండింగ్‌లో పెట్టారు. ఈ నియామకాలపై కొన్ని అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఎన్నికల తర్వాత కూడా



జనక్ ప్రసాద్



నేరెళ్ల శారద

ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని పెండింగ్‌లో పెట్టింది. మాజీ ముఖ్య మంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా సోమవారం 35 కార్పొరేష న్లకు చైర్మన్లను నియమిస్తూ పెండింగ్‌లో పెట్టిన జీవోను విడుదల చేశారు. ఈ నియామకాల్లో శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ చైర్మన్‌గా కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి అవకాశం లభించింది. జీవో విడుదల కాగానే ఆయన వెంటనే పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈ నియామకాల్లో మహిళా కమిషన్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన మహిళా కాంగ్రెస్ నేత, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అ ధ్యక్షురాలు నేరెళ్ల శారదకు అవకాశం కల్పించారు. ప్రస్తుతం 35 మందికి మాత్రమే నియామకాలు ఇస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మహిళా కమిషన్ చైర్మన్ పదవికి గవర్నర్ ఆమోదముద్ర పడిన తర్వాతే జీవో వెలువడుతుందని, అందుకే ప్రస్తుత 35 చైర్మన్ల నియామకాల ఉత్తర్వుల తో శారద నియామక ఉత్తర్వులు రాలేదని సమాచారం. ఉమ్మడి జిల్లా లోని మంథని నియోజకవర్గానికి చెందిన అయిత ప్రకాశ్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. ఆయనను స్టేట్ ట్రేడ్ ప్రమో షన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థకు చైర్మన్‌గా నియమించారు. ప్రకాశ్‌రెడ్డి మంథని నియోజకవర్గంలోని మల్హర్ మండలానికి చెందిన వారు కాగా ప్రస్తుతం ఆ మండలం మంథని నియోజకవర్గంలోనే ఉన్నా భూపాలపల్లి జిల్లాకు మారింది. ప్రకాశ్‌రెడ్డి కాంగ్రెస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. సింగరేణి కార్మిక నాయకుడు, ఐఎన్టీయూసీకి చెం దిన నేత జనక్‌ప్రసాద్‌కు స్టేట్ మినిమం వేజెస్ అడ్వయి జరీ బోర్డు చైర్మన్ పదవి దక్కింది. ఉమ్మడి జిల్లా నుంచి చైర్మన్ పదవులు పొందిన ముగ్గురికి కూడా మంత్రి శ్రీధర్‌బాబు ఆశీస్సు లతోనే అవకాశంలభించిందని కాంగ్రెస్‌వర్గాల సమాచారం.

● నిరీక్షణకు తెర...

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కరీంనగర్ శాసనసభ స్థానం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించారు. ఆయన పేరు ఏఐసీసీ పరిశీలనకు వెళ్లినా పలు చర్చోపచర్చలు, వాయిదాల అనంతరం టికెట్ మరోనేత పురమల్ల శ్రీనివాస్‌కు దక్కింది. కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా పనిచేసి కష్ట నష్టాలు అనుభవించిన తనకు కార్పొరేషన్ల నియామ కాల్లో సముచిత స్థానం కల్పించాలని ఆయన పార్టీ పెద్దలను కోరుతూ వచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు ఆశీస్సులతో ఆయన ప్రస్తుతం సుడా చైర్మన్ పదవిని పొంది సోమవారం జీవో చేతికి అందిన వెంటనే సుడా కార్యాలయానికి వెళ్లి పదవీ బాధ్యతలు స్వీక రించారు. కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి 1992లో ఎన్ఎస్‌యూఐ నుంచి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డం గుల సంస్థ డైరెక్టర్‌గా అదే సంస్థకు చైర్మన్‌గా పని చేశారు. టీపీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్‌పార్టీ కష్టకాలం ఉన్న సమయంలో కరీంనగర్‌లో పార్టీని అంటి పెట్టుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. 2018 నుంచి కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా ఇప్పటి వరకు కొనసాగుతున్నారు. చాలా మంది కాంగ్రెస్‌పార్టీ నాయకులు పార్టీని వీడినా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల్లో ఉన్నారు. కరీంనగర్‌లో పార్టీ నాయకులు వివిధ పార్టీల్లో చేరడంతో ఒంటరిగా పోరాడి కేడర్‌ను కూడగట్టి కాంగ్రెస్‌పార్టీని పటిష్టానికి కృషి చేశారు.

● అందరి సహకారంతో అభివృద్ధికి కృషి



కరీంనగర్ అర్బన్: సుడా చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సుడా వైస్ చైర్మన్‌గా ఉన్న అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్.. కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి చార్జి ఇచ్చారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ప్రభుత్వ విప్‌లు లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, విజయరమణారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సుడా పరిధిలో ఉన్న అన్ని గ్రామాలతోపాటు నగరంలో విలీనమైన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రతి కార్యకర్త, నాయకులకు అందుబాటులో ఉండి, వారు తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తానని అన్నారు. వైఎస్సార్ జయంతి రోజు బాధ్యతలు తీసుకోవడం సంతోషంగా ఉందని నరేందర్‌రెడ్డి అన్నారు.

నత్తనడకన 'దోస్త్'

- మూడు విడతల అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినా 34 శాతమే సీట్ల భర్తీ
- ఇంజనీరింగ్ వైపు మొగ్గు చూపుతూ డిగ్రీని పట్టించుకోని విద్యార్థులు



గణేశ్‌నగర్,జూలై 8 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో 84 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇప్పటి వరకు దోస్త్ ద్వారా మూడు విడతల అడ్మిషన్లు పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 శాతం మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయి. కొద్దిగా పేరు ఉన్న రెండు మూడు కళాశాలలో మాత్రమే అడ్మిషన్లు నమోదయ్యాయి. మిగితా కళాశాలల్లో వందలోపే అడ్మిషన్లు రావడంతో యాజమాన్యాలు తలలు పట్టుకుంటున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే కొన్ని కళాశాలను మూతపడే అవకాశం ఉంది. విద్యార్థులు ఎక్కువ శాతం ఇంజనీరింగ్ వైపు చూస్తున్నారు. మరి కొందరు ఇతర వృత్తివిద్య కోర్సులు వైపు ఆసక్తి చూపడంతో డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం కాస్త మెరుగ్గా ఉన్నట్లు తెలుస్తున్నాయి. దోస్త్ మూడో విడతలో శాతవాహ న విశ్వవిద్యాలయ పరిధిలో 6,193 సీట్లను ఉన్నత విద్యా మండలి కేటాయించింది. మొత్తం మూడు విడతల్లో 15,903 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 29,953 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మూడో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు 11వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. లేకపోతే సీటు రిజిస్ట్రేషన్ రద్దు అవుతుంది. డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు ఈనెల 15 నుంచి ప్రారంభమవుతాయని ఎస్‌యూ దోస్త్ కో ఆర్డినేటర్ తెలియజేశారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

రామడుగు, జూలై 8: విధులను నిర్లక్ష్యం చేస్తూ.. నిధులను దుర్వినియోగం చేసిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని దేశ్‌రాజుపల్లి పంచాయతీ కార్యదర్శి సంతోష్ చట్ట విరుద్ధమైన ఇంటి పన్నుల రశీదులు, అసైన్డ్ మార్గదర్శకాలు, మ్యూటేషన్‌లను జారీ చేయడంతోపాటు నియమాలు, మార్గదర్శకాలు పాటించకుండా విధులపై నిర్లక్ష్యం ప్రదర్శించారు. గోపాల్‌రావుపేట పంచాయతీ కార్యదర్శి ఎండీ పాషా విధులను నిర్లక్ష్యం చేయడంతో పాటు గుర్తు తెలియని వ్యక్తికి డిమాండ్ రిజిస్టర్‌ను అందజేశారు. ఈ మేరకు ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు.

ప్రజావాణికి 396 దరఖాస్తులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బండి మల్లయ్య యాదవ్

సుభాష్‌నగర్, జూలై 8: కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 396 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం ప్రజావాణిలో ఆమె దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులను అధికారులు వెంటవెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశతో వస్తున్న బాధితులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో పెట్టకూడదన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు, ఏవో సుధాకర్, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

● మట్టి అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ రూరల్: మండలంలోని మొగ్దుంపూర్ గ్రామంలో పురేని గుట్ట మట్టిని ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన బండి మల్లయ్య యాదవ్ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు.

● **భగత్‌నగర్:** కొత్తపల్లిమండలం మల్కాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలనికోరుతూ ప్రజావాణిలో కలెక్టర్‌కు రైతు సేవాసమితి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో పండుగ లక్ష్మీపతి పాల్గొన్నారు.

● దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి వసతి సౌకర్యం కల్పించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి వినయ్‌సాగర్, తిప్పారపురోహిత్, సందేశ్ పాల్గొన్నారు.

● ఉపాధి హామీ కూలీలకు పెండిగ్ బిల్లులు, సమ్మర్ అలవెన్స్‌లు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శికొయ్యడ సృజన్‌కుమార్ ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బోయినిఅశోక్ తదితరులు పాల్గొన్నారు.

డొక్కు బస్సులే దిక్కు

కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికుల ఇబ్బందులు



హుజూరాబాద్-జమ్మికుంట మధ్య నడిచే మినీ బస్సు

హుజూరాబాద్, జూలై 8: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగిన... డొక్కు బస్సులే దిక్కయ్యాయి. బస్సు ఎక్కితే ఎక్కడ ఆగిపోతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. అందుకు తగ్గట్టుగా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో బస్సుల్లో నిలుచొని ప్రయాణిస్తున్నారు. హుజూరాబాద్ డిపోలో గతంలో 90 బస్సులు ఉండేవి. ప్రస్తుతం 61 మాత్రమే ఉన్నాయి. అందులో ప్రైవేట్ బస్సులు 21 ఉండగా, మిగిలిన 40 ఆర్టీసీ బస్సులు పాతవే. పాత బస్సులకే రంగులు వేసి రోడ్లపైకి పంపిస్తున్నారు. రద్దీ అధికంగా ఉండే మార్గాలోనే ఈ బస్సులను నడుపుతుండడంతో ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. నిబంధనల ప్రకారం 14ఏళ్లు, 12.5 లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సులను పక్కన పెట్టాలి. కానీ ఆర్టీసీ అధికారులు అవేమి చేయకుండా రోడ్లపైనే తిప్పుతున్నారు. దీంతో బస్సులు ఎప్పుడు, ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ బస్సులు నడపలేక డ్రైవర్లు కూడా ఇబ్బందులు పడుతున్నారు.



జమ్మికుంట రోడ్‌లో నిలిచిపోయిన బస్సు

● 60 శాతం కాలం చెల్లిన బస్సులే...

హుజూరాబాద్ డిపోలో 60 శాతం కాలం చెల్లిన బస్సులే ఉన్నాయి. హుజూరాబాద్ డిపోకు చెందిన బస్సులు ప్రతిరోజు సుమారు 20వేల మందిని వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను తరలిస్తుంటాయి. ఈ కాలం చెల్లిన బస్సుల మరమ్మతులకు గ్యారెజీలో సామగ్రి లేకపోవడంతో ఉన్న వాటినే వివిధ రూట్‌లలో తిప్పుతున్నారు. గ్యారెజీలో మెకానిక్‌ల కొరత ఉంది. హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు గతంలో మినీ బస్సులను ఏర్పాటు చేశారు. అవి చెడిపోయాయి. దీంతో ఈ బస్సుల్లో ప్రయాణించాలంటే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి డిపో మేనేజర్‌ను సంప్రదించగా కొత్త బస్సుల కోసం ప్రతిపాదనలను పంపించామన్నారు. కాలం చెల్లిన బస్సులను గుర్తించి పక్కన పెడుతున్నామన్నారు.

అధ్వానంగా రైతు వేదికలు

- మూలకుపడ్డ డ్రమ్ సీడర్లు
- పర్యవేక్షణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు



నిరుపయోగంగా ఉన్న డ్రమ్ సీడర్

గంగాధర, జూలై 8: అన్నదాతలకు ఉపయోగడేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతు వేదికలు అధ్వానంగా మారాయి. సమావేశాలు నిర్వహించే సమ యంలో తప్ప వాటిని పట్టించుకోక పోవడంతో మందుబాబులకు అడ్డాలుగా నిలుస్తున్నాయి. గత ప్రభుత్వంలో రైతు వేదికలు నిర్మించారు. వాటిని పట్టించుకోక పోవడంతో అధ్వానంగా మారాయి. గ్రామాలకు దూరంగా జన సంచారం లేని ప్రదేశంలో వేదికలు నిర్మించడంతో సాయంత్రమైతే చాలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. మండ లంలోని రైతు వేదికల్లో ఎక్కడ చూసిన మద్యం సీసాలే దర్శన మిస్తున్నాయి. రైతులకు పెట్టుబడి భారం తగ్గించాలని ప్రతి రైతు వేదికలో డ్రమ్ సీడర్‌ను అందు బాటులో ఉంచారు. వాటిని ఏర్పాటు చేసి రైతు వేదికలకు భూసార పరీక్షలకు సంబంధించిన రసా యనాలను ప్రభుత్వం అందించింది. ఏళ్లపాల నిర్లక్ష్యంగా రసా యానాలు కాలం చెల్లి నిరుపయోగంగా మారాయి. రైతు వేది కల నిర్మాణంలో అధికా రులు నాణ్యత ప్రమా ణాలు పాటించ లేదు. తలుపులు ఎక్కడి వక్కడ పగిలిపోతుండగా విద్యుత్ వై రింగ్ సక్రమంగా చేపట్టలేదు. ఇప్పటి కైనా రైతు వేదికలను అధికారులు పర్యవేక్షించి విని యోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



కురిక్యాల రైతు వేదిక వద్ద మద్యం సీసాలు

జిల్లా ఆసుపత్రిని సందర్శించిన ఎన్‌హెచ్‌ఎం బృందం



డిస్పెన్సరీని పరిశీలిస్తున్న ఎన్‌హెచ్‌ఎం బృందం సభ్యులు

సుభాష్‌నగర్, జూలై 8: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఢిల్లీ బృందం సోమవారం జిల్లా ఆసుపత్రిని సందర్శించింది. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్ (ఐపీహెచ్‌ఎస్) ప్రకారం జిల్లా ఆసుపత్రి 80 శాతం కంటే ఎక్కువ స్కోరు చేసింది. ఆసుపత్రి నుంచి అందిన నివేదిక ఆధారంగా ఎన్‌హెచ్‌ఎం బృందం సభ్యులు పి కన్నన్, దీపాలికౌశిక్ ఐపీహెచ్‌ఎస్ నిభందనల ప్రకారం ఉన్నదా లేదా అనే అంశంపై పునఃపరిశీలన చేసేందుకు బృందం ఆసుపత్రిని సందర్శించి తనిఖీలు నిర్వహిం చింది. 500 పడకల ఆసుపత్రిలో ఉండాల్సిన అన్ని రకాల మౌలిక సదు పాయాలు, వసతులు, సరిపడా వైద్యులు, సిబ్బంది వివరా లను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎం హెచ్‌వో డాక్టర్ సుజాత, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్‌ఎంవో డాక్టర్ నవీన, క్వాలిటీ కన్సల్టెంట్ సాగర్ పాల్గొన్నారు.

రాయికల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో

మినీ బ్రిడ్జి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్, జూలై 8: రాయికల్ పట్టణంలో వివిధ గ్రామాలను అనుసంధానం చేస్తూ వెళ్తున్న రోడ్డులో నిర్మిస్తున్న మినీ బ్రిడ్జిలను నాణ్యతా ప్రమాణాలతో వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ రాయికల్ పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని సంబంధిత అధికారులను బాధ్యులుగా చేస్తూ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గత వారంలో మైతాపూర్ రోడ్డులో గల బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సు 11 కేవీ స్తంభానికి అంటుకుని ప్రమాదపుటంచుల్లో వెళ్లిందని, వెంటనే బ్రిడ్జిలను పూర్తి చేయాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి కోరుట్ల, మేడిపల్లి, వేములవాడకు సంబంధించినటువంటి రవాణా కూడా ఈ బ్రిడ్జిలపై నుంచే వెళ్తూ ఉండటంతో వచ్చే వర్షాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా వాటిల్లకుండా వెంటనే నిర్మాణాలను పూర్తి చేసి పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా విడుదల చేసి కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కురుమ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కుంబోజి రవి, బొడుగం శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు కోల శంకర్, కునారపు భూమేష్, బీసీ సెల్ అధ్యక్షుడు ఆశన్న, రామన్న, ఐటీ సెల్ అధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్, కటకం కిషోర్, బీజేవైఎం నాయకులు బుర్ల గోపి, బంటి, బూత్ అధ్యక్షుడు రామకృష్ణ, అల్లె నర్సయ్య, శేఖర్, ఎల్లాగౌడ్, రాజేంద్రప్రసాద్, కంటె భూమేష్, ఇద్దాం గంగారెడ్డి, కట్ట రాము, నర్సయ్య పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జూలై 8: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని పెగడపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన గోపగోని రాజయ్య(40) అనే గీత కార్మికుడు సోమవారం తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. రాజయ్య తలకు కాళ్లకు చేతులకు నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన రాజయ్యను కుటుంబసభ్యులు పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతోనే అభివృద్ధి

- ఇక అభివృద్ధిపైనే దృష్టిపెడదాం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు



సిరిసిల్లలో మాట్లాడుతున్న బండి సంజయ్

సిరిసిల్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు అయిపోయాయి.. ఇకపై ఒకరినొకరు తిట్టుకోవడం బంద్ చేద్దాం, విమర్శలు, ఆరోపణలు పక్కన పెట్టి అభివృద్ధిపై ఫోకస్ చేద్దామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే అభివృద్ధి జరుగుతుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం సిరిసిల్ల నియోజకవర్గంలోని సిరిసిల్ల, వీర్నపల్లి, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. సిరిసిల్లకు వచ్చిన బండి సంజయ్‌కు బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. సిరిసిల్లలో రూ. 10 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపం ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని గ్రామాలు, పట్టణాలు,



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు

అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పక్షాన సంపూర్ణ సహకారం అందించే బాధ్యత తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. కుల సంఘాల కార్యాలయాలు నిర్మిస్తే ఆసంఘంలోని నాయకులకే ఉపయోగపడుతుందని కానీ కుల సంఘాల తరఫున కల్యాణ మండపాలు నిర్మిస్తే ఆ కులంలోని ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందని ఆలాంటి వాటికే ఎంపీ నిధులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏ కుల సంఘం అయినా ఆ కులంలోని పేదలకు సహాయ, సహకారాలు అందిస్తూ ఆదుకున్నప్పుడే కుల సంఘాలకు మనుగడ ఉంటుందన్నారు. మీలో ఒకడిగా మున్నూరు కాపు సంఘం చేపట్టే ప్రజోపయోగ పనులకు తన వంతుగా సహకారం అందిస్తానని అన్నారు.

రెండోసారి ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించడంలో సిరిసిల్ల జిల్లా ప్రజల భాగస్వామ్యం ఉందన్నారు. రెండోసారి గెలవడం వల్లనే మోదీ కేబినేట్‌లో చోటు దక్కిందన్నారు. జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. నిధులు తీసుకవచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవయ్య, పట్టణ అధ్యక్షుడు అగ్గిరాములు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, కౌన్సిలర్ కల్లూరి రాజు, సంఘం ప్రతినిధులు శీలం రాజు, దుమాల శ్రీకాంత్, నీలి శంకర్, ఎరుకల ప్రకాష్, కుల్ల సత్తయ్య, నాయిని కిషన్, బాలయ్య, నర్సయ్య, వేణు పాల్గొన్నారు.

విద్యార్థులపై తెగిపడిన విద్యుత్ వైర్లు

- గంగాధరలోని బీసీ గురుకులంలో ఘటన
- ఇద్దరు విద్యార్థులకు విద్యుదాఘాతం
- తప్పిన ప్రమాదం



చికిత్స పొందుతున్న అశ్విత్



విద్యార్థికి అయిన గాయాలు

గంగాధర, జూలై 8: విద్యుత్ తీగలపై కోతులు ఎగరడంతో వైర్లు తెగి విద్యార్థులపై పడగా విద్యుదాఘాతంతో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. వైర్లు తెగిపడగానే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గంగాధరలోని బీసీ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి నియోజకవర్గ బీసీ గురుకుల బాలుర పాఠశాల గంగాధర బ్లాకులోని ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. సోమవారం ఉదయం తరగతులకు వెళ్లేందుకు విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. పాఠశాల బాత్‌రూంల పైనుంచి గంగాధర, లక్ష్మీదేవి పల్లి ఎక్స్‌ప్రెస్ 11కేవీ విద్యుత్ లైను ఉంది. అయితే ప్రతి రోజు విద్యార్థులు తినగా మిగిలిన ఆహారం పక్కనే పడేస్తారు. పాఠశాల పక్కనే చెట్లపైనుంచి కోతులు ఆహారం కోసం వస్తుంటాయి. సోమవారం కోతులు 11 కేవీ వైర్లపై నుంచి ఆహారం కోసం వస్తున్న సమయంలో అవి తెగిపడ్డాయి. అప్పుడే కాలకృత్యాలు తీర్చుకుంటున్న ఆరో తరగతి విద్యార్థి ఎ అశ్విత్‌పై విద్యుత్ తీగపడింది. విద్యుత్ వైరు తెగిపడగానే సబ్‌స్టేషన్‌లో ఫీజు కొట్టేసి సరఫరా నిలిచి పోయింది. విద్యార్థిపై తీగపడగా పొట్టభాగంలో, కుడిచేతిపై గాయాలయ్యాయి. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న ఓ. అశ్విత్ కాళ్లపై తీగ పడటంతో స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే సిబ్బంది వీరిద్దరినీ 108లో కరీంనగర్ తరలించారు. ప్రస్తుతం ఇద్దరికి ఎలాంటి ప్రాణాపాయం లేదు. ఏ అశ్విత్ డిశ్చార్జికాగా మరో విద్యార్థిని డిశ్చార్జి చేయనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈఘటనను చూసిన మరో ఇద్దరు విద్యార్థులు స్పృహతప్పి పడిపోగా స్థానిక వైద్యశాలలో చికిత్స అందించారు.



పాఠశాల నుంచి ఉన్న 11 కేవీ విద్యుత్ లైను

నిత్య కల్యాణానికి మంగళసూత్రాలు బహూకరణ

ధర్మపురి, జూలై 8: ధర్మపురి క్షేత్రం లోని శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో జరిగే నిత్యకల్యాణానికి హైదరాబాద్ వాస్తవ్యులు శృత ప్రీతి, సునీత, సత్యవతి, సరిత, సరళ, రెండు జతల బంగారు సూత్రాలను సోమవారం సమర్పించారు. సుమారు నాలుగు లక్షల విలువ గల మంగళసూత్రాలు ప్రతి నిత్యం స్వామివారి కల్యాణం సమయంలో అలంకరణ కోసం కార్యాలయంలో ఈవో సంకటాల శ్రీనివాస్‌కు అందించారు. వారందరిని ఆలయ పక్షాన ఈ ఓ శ్రీనివాస్ స్వామి శేషవస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు.



ఈవో శ్రీనివాస్‌కు మంగళసూత్రాలు అందజేస్తున్న దాతలు

మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు హుస్సేన్ అరెస్ట్


మహ్మద్ హుస్సేన్

జమ్మికుంట, జూలై 8: కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు, సికాసా వ్యవస్థాపక కమిటీ సభ్యుడు మహ్మద్ హుస్సేన్ అలియాస్ సుధాకర్, అలియాస్ రమాకాంత్‌ను సోమవారం తెల్లవారు జామున పోలీస్‌లు అరెస్ట్ చేశారు. 1977లో మహ్మద్ హుస్సేన్ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2009లో జార్ఖండ్ రాష్ట్రంలో పోలీస్‌లు ఆయనను అరెస్ట్ చేశారు. జైలు జీవితం అనుభవించిన అనంతరం 2011లో జమ్మికుంటకు వచ్చారు. అప్పటి నుంచి హుస్సేన్ ఇక్కడే ఓ ఇంటిలో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఆయన సోదరుడి కుమారుడు రబ్బాని ఇంటి పక్కనే ఉంటూ అలానాపాలన చూసుకుంటున్నాడు. హుస్సేన్ కొంత కాలంగా బీపీ, షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల కంటి సమస్య తలెత్తడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కంటికి ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు బంధువులు తెలిపారు. సోమవారం తెల్లవారు జామున పోలీస్‌లు సివిల్ డ్రెస్‌ల్లో మహ్మద్ హుస్సేన్ ఉంటున్న ఇంటికి చేరుకున్నారు. నిద్రపోతున్న మహ్మద్ హుస్సేన్‌ను లేపి వెంట తీసుకువెళ్లారు. ఈ సమయంలో పక్క ఇంట్లోనే ఉంటున్న హుస్సేన్ సోదరుడి కుమారుడు రబ్బాని వచ్చి ఎవరు మీరు, ఏం కావాలి, ఎక్కడికి తీసుకు వెళ్తున్నారంటూ ప్రశ్నించినా సమాధానం చెప్పకుండానే తీసుకు వెళ్లారని అతడు తెలిపాడు. హుస్సేన్ వద్ద ఉదయం 11గంటల సమయంలో రబ్బాని ఫోన్‌కు పోలీసుల నుంచి ఫోన్ వచ్చింది. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుల్‌ను మాట్లాడుతున్నానని, హుస్సేన్‌ను ఓ పాత కేసులో విచారణ నిమిత్తం తాము తీసుకు వచ్చామని, మంచిర్యాల కోర్టులో హాజరుపరుస్తామని చెప్పి ఫోన్ కట్ చేశారు. దీంతో రబ్బాని కుటుంబ సభ్యులు వెంటనే రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తెలిసింది. 1971లో హుస్సేన్- జిలానిబేగంకు వివాహం జరిగింది. ఆమె 1992లో ఉద్యమంలోకి వెళ్లింది. 1996లో గోదావరిఖనిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆమెమృతి చెందింది.


హుస్సేన్ అరెస్టును చూపెడుతున్న ఏసీపీ రవికుమార్

వివరాలు వెల్లడించిన రామకృష్ణాపూర్ పోలీసులు

రామకృష్ణాపూర్, జూలై 8: మావోయిస్టు కీలక నేత మహ్మద్ హుస్సేన్ అలియాస్ సుధాకర్ అలియాస్ రమాకాంత్‌ను అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. సోమవారం రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రెండు నెలలుగా మావోయిస్టు, సికాస భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో మందమర్రి, రామకృష్ణాపూర్ పరిసర ప్రాంతాలలో తిరుగుతున్నాడనే సమాచారంతో సీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఏసీపీ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. సోమవారం రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ ఆర్కే-1ఏ గని సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా హుస్సేన్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో విచారించగా మావోయిస్టు కరపత్రాలు, డాక్యుమెంట్లు, వాల్ పోస్టర్లు, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మందమర్రికి చెందిన హుస్సేన్ ప్రస్తుతం జమ్మికుంట ప్రాంతంలో నివాసం ఉంటున్నాడని, 1978 నుంచి 1981 వరకు సింగరేణి కార్మికుడిగా కెకె-2 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేశాడని తెలిపారు. ఈ సందర్భంగా మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన

ప్రజాకవి, రచయిత మహ్మద్ హుస్సేన్ అరెస్టు అప్రజాస్వామికమని వెంటనే పోలీసులు ఆయనను విడుదల చేయాలంటూ సోమవారం రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్ వద్ద పౌర హక్కుల సంఘం, విప్లవ రచయితల, ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకులు నిరసన చేపట్టారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, ఉపాధ్యక్షులు సుచరిత, నార వినోద్, సహాయ కార్యదర్శి వినోద్, బోడ్డు రవి, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్ కన్వీనర్ బాలసాని రాజమ్మ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి కన్వీనర్ గాండ్ల మల్లేశం తదితరులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

తిమ్మాపూర్, జూలై8: మండలంలోని రేణికుంట గ్రామం రాజీవ్ రహదారిపై గల టోల్‌ప్లాజా వద్ద పీడీఎస్ బియ్యం తరలిస్తున్న రెండు లారీలను సివిల్ సప్లయ్ అధికారులు, ఎల్ఎండి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి జిల్లా దేవునిపల్లికి చెందిన గురువయ్య అనే వ్యక్తి పలువురి వద్ద నుంచి తక్కువ ధరకు పిడిఎస్ బియ్యం కొనుగోలు చేసి ఆ బియ్యంను పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నరసింహులపేట గ్రామ శివారులో డంపు చేశాడు. డంపు చేసిన బియ్యం రెండు లారీల్లో లోడ్ చేసి సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కి తరలిస్తుండగా ఖచ్చితమైన సమచారంతో రేణికుంట టోల్ ప్లాజా వద్ద సివిల్ సప్లయ్ ఆధికారులు, ఎల్ఎండి పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. లారీల్లో 452.30 క్వింటాళ్లు, 11,30,750రూపాయల విలువల గల బియ్యం పట్టుకున్నారు. బియ్యంను కరీంనగర్‌లోని యంఎల్ఎస్ పాయింట్ గోడౌన్‌కు తరలించారు. లారీ డ్రైవర్లను అదుపులోకి తీసుకొని, బియ్యాన్ని తరలిస్తున్న గురువయ్య, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు. లారీలను పట్టుకున్న వారిలో తిమ్మాపూర్ సిఐ కె.స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట రూరల్, జూలై 8: జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ గ్రామంలో ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 38.90క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఆదివారం అర్ధరాత్రి పోలీస్‌లు పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవీందర్ తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు

మానకొండూర్ : మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. రేషన్ డీలర్ సురేష్ దుకాణంలో పౌరసరఫరాలు, విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేపట్టారు. దుకాణంలో 33.71 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. డీలర్ సురేష్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన డీలర్ లక్ష్మీనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 3,414 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,414 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 11.965 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.975 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

రైలు ఢీకొని ఒకరి మృతి

కోరుట్ల, జూలై 8 : కోరుట్ల పట్టణానికి చెందిన చిట్యాల నరేశ్ (32) అనే వ్యక్తిని సోమవారం రైలు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఎస్సై కథనం ప్రకారం... మతిస్థిమితం లేని నరేశ్ ఇంటి నుంచి వెళ్లగా చిన్నమెట్‌పల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నిజామాబాద్ రైల్వే ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు

భర్త చేతిలో భార్య హత్య

● అనంతరం తానూ ఆత్మహత్యాయత్నం

మేడిపల్లి, జులై 8: అనుమానం పెనుభూతంగా మారి కట్టుకున్న భార్యను కడతేర్చాడు. మండలంలోని తొంబర్రావుపేట గ్రామానికి చెందిన రాయంచు లింగంకు కట్లకుంట గ్రామానికి చెందిన లక్ష్మి (45)తో 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాలు వీరి దాంపత్యం అన్యోన్యంగా సాగింది. ఇంతలోనే లక్ష్మి గ్రామంలోనే ఒకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందని భర్త లింగంకు అనుమానం కలిగింది. దాంతో వీరి మధ్య తరచూ గొడవలు మొదలయ్యాయి. లింగం ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు, సంవత్సరం క్రితం సెలవుపై వచ్చి కూతురికి వివాహం చేశాడు. అనంతరం లింగం అతని కొడుకు గల్ఫ్ వెళ్లారు. ఉన్నట్టుండి లింగం హటాత్తుగా ఆదివారం సాయంత్రం గల్ఫ్ నుంచి ఇంటికి వచ్చాడు. రాత్రి బెడ్‌రూంలో నిద్రిస్తున్న తన భార్య మెడకు తాడు కట్టి ఉరివేసి ఇనుప పారతో కొట్టి హత్య చేశాడు. అనంతరం లింగం అక్కడే ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఉదయాన్నే ఇరుగుపొరుగు వారు గమనించి లింగంను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై శ్యామ్‌రాజ్ దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జూలై 8: కరీంనగర్ జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న వ్యాపారి కట్కూరి రాజు(47) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం కట్కూరి రాజు కరీంనగర్ మండలం వల్లంపహాడ్‌లో ఒక ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజులాగే ఈ నెల 7న ఉదయం 10 గంటలకు దుకాణానికి వెళ్లి సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ తరువాత రాత్రి 7 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. సోమవారం ఉదయం రాజు కుటుంబ సభ్యులు రెండో ఠాణా పోలీసులకు సమాచారం అందించగా సాంకేతికతతో రాజు ఉన్న లోకేషన్‌కు వెళ్లి చూడగా అల్కాపురికాలనీలోని ఒక ఎండిపోయిన కుంట దగ్గర పురుగుల మందు తాగి చనిపోయి కనిపించాడు. మెహర్‌నగర్‌లో ఒక అపార్ట్‌మెంట్‌లో రాజు ఒక ఒక ఫ్లాట్‌ను కొనుగోలు చేయగా నిర్మాణం తీవ్ర జాప్యం అవుతున్నందున తరచుగా మనస్థాపం చెందేవాడని, ఈ కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య కట్కూరి విజయ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఒకరి అదృశ్యంపై కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 8: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి న్యూమారేడుపాకలో దొంతుల సతీష్ అనే వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యానికి బానిసైన సతీష్ తరచూ భార్య శిరీషతో గొడవ పడేవాడు, భర్త ప్రవర్తనతో విసుగు చెందిన శిరీష తన తల్లి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఆదివారం మద్యం సేవించి ఇంటికి రాగా అతిగా తాగుతుండడం, భార్యతో గొడవ పడిన విషయమై సతీష్‌ను తండ్రి మందలించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తండ్రితో గొడవ పడిన సతీష్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు రాకపోవడంతో కుటుంబీకులు వెతికినా సతీష్ ఆచూకీ లభించలేదు. భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కమాన్‌పూర్, జూలై 8: మండలంలోని రొంపికుంటకు చెందిన ఓ యువకుడు మనస్తాపానికి గురై సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొయ్యడ కుమార్(28) అనే యువకుడికి చెందిన గొర్లు అదే గ్రామానికి చెందిన పులిపాక బొంద్యాలు అనే వ్యక్తి తోటలోని బబ్బెర చెట్లు మేశాయి. ఈ మేరకు సోమవారం ఉదయం పంచాయితీకి రావాలని అదే గ్రామానికి చెందిన కటకం రవీందర్ పిలిచారు. కానీ కొయ్యడ కుమార్ సోమవారం ఉదయం తన పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలోనే కొయ్యడ కుమార్ ఇంటికి అదే గ్రామానికి చెందిన వీఆర్‌ఏ వెళ్లి పంచాయితీకి రావాలని చెప్పగా కుమార్ భార్య రేణుక తన భర్త పొలానికి వెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే వీఆర్‌ఏ కొయ్యడ కుమార్ పొలానికి వెళ్లి చూసేసరికి మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పంచాయితీకి రాకపోతే కేసు పెడుతారన్న భయంతో మనస్తాపానికి గురై తన భర్త ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్ప డినట్లు మృతుడు కుమార్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

● మృతుడి కళ్లు సజీవం

గ్రామానికి చెందిన కొయ్యడ కుమార్ ఆత్మహత్యకు పాల్పడగా గ్రామానికి చెందిన కొడి అనిల్ నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈమేరకు నేత్రదానం చేసేందుకు మృతుడి భార్య ముందుకు వచ్చారు. కరీంనగర్ ఎల్‌వీపీ టెక్నీషియన్ గాజుల సతీష్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైదరాబాద్ ఎల్‌విపి ఐ బ్యాంక్‌కు పంపారు. నేత్రదానం చేయటంపై మృతుడి భార్య, తల్లిదండ్రులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డాక్టర్ బీష్మాచారి, ముఖ్య సలహాదారులు నూక రమేష్ తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

శంకరపట్నం, జూలై 8: రోడ్డు ప్రమాదంలో గాయ పడిన ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన శంకరపట్నం మండలం కొత్తగట్టులో చోటు చేసుకుంది. కొత్తగట్టు గ్రామానికి చెందిన పల్లె రజిత (47) ఈ నెల 5న మధ్యాహ్నం పొలం పనులు ముగించుకొని భర్త మహేందర్‌రెడ్డి కోసం పెద్దగుట్ట దాబా హోటల్ ముందు నిలబడి ఉంది. ఈ క్రమంలో కరీంనగర్ వైపు నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఓ కారు ఢీకొట్టింది. రజిత తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

ఆర్టీసీలో భారీగా బదిలీలు

భగత్‌నగర్, జూలై 8: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో భారీగా బదిలీలు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. మెట్‌పల్లి డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న జి.వేదవతి హైదరాబాద్ పారుక్‌నగర్‌కు, వరంగల్-2 డిపో మేనేజర్ జి.సురేష్‌ను కరీంనగర్ బస్‌స్టేషన్ ఎటిఎంగా, కరీంనగర్ ఎటిఎం రజనీకృష్ణను లాఆఫీసర్ వరంగల్, గోదావరిఖనికి బదిలీ చేశారు. సిరిసిల్ల డిపో మేనేజర్ ఎన్.మనోహర్ కోరుట్లకు, కోరుట్ల డిపో మేనేజర్ విజయ మాధురి కరీంనగర్-1 డిపోకు, మంథని డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ జెబిఎస్ సిఆర్ఎంకు, కొత్తగూడెం అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ విఎస్‌కుమార్ పదోన్నతిపై మంథని డిపో మేనేజర్‌గా, హైదరాబాద్‌లో పనిచేస్తున్న బి.శ్రీనివాస్ వేములవాడ డిపో మేనేజర్‌గా, వేములవాడలో పనిచేస్తున్న డిపో మేనేజర్ మురళికృష్ణ గద్వాల్ డిపో మేనేజర్‌గా, మెహిదీపట్నం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎ ప్రకాశ్ రావును సిరిసిల్ల డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌ను హుజూరాబాద్‌కు, కరీంనగర్ కార్గో ఎటిఎం సదాశివ్‌ను కరీంనగర్ వర్క్‌షాపులోని టైర్స్ సెక్షన్‌లో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్‌గా, భద్రాచలం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న వి రామారావును కరీంనగర్ కార్గో ఎటిఎంగా బదిలీ చేస్తున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, జూలై 8: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం ఎల్లమ్మగుడి సమీపంలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా విలాసాగర్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

మెట్‌పల్లి, జూలై, 8 : గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకునట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు. మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 6న మండలంలోని మేడిపల్లి శివారులో ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించాడు. అదే సమయంలో అనుమానా స్పదంగా కోరుట్ల పట్టణానికి చెందిన నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై అక్కడి వచ్చారు. పోలీసులను గమనించి ఇద్దరు యువకులు పారిపోగా కోరుట్ల పట్టణానికి చెందిన మరో ఇద్దరు మైనర్లను పట్టుకొని 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని విచారించారు. నలుగురు యువకులు మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహమ్మద్ అజార్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కోరుట్లకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. నాందేడ్‌లో గంజాయి అమ్ముతున్న మహమ్మద్ అజార్‌ను పట్టుకోవాలని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు ఆదేశాల మేరకు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి అజార్‌ను అదుపులోకి తీసుకుని సోమవారం తీసుకొచ్చారు. మైనర్లకు వైద్య పరీక్షలు చేయించి అనంతరం ముగ్గురిని కరీంనగర్‌లోని జువైనల్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. గంజాయి అమ్మిన, సరఫరా చేస్తున్న వారి వివరాలను పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం

కలెక్టర్ ఎదుట మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం

సుభాష్‌నగర్, జూలై 8: 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేసిన 11లక్షల రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరుతూ కలెక్టర్ పమేలా సత్పతి ఎదుట ఓ మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో కలెక్టర్ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించిన రామడుగు మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త జగన్‌మోహన్‌గౌడ్ ఆమె ముందే మెడకు చేతి రుమాలు చుట్టుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అక్కడ ఉన్న పోలీసులు ఆయనను అడ్డుకొని బయటకు తీసుకెళ్లారు. అనంతరం జగన్‌మోహన్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ చాలా కాలంగా తనకు రావలసిన బిల్లుల కోసం అధికారులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఇవ్వడం లేదన్నారు. రూ.11లక్షల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన చెందారు. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేకపోతున్నానని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తేనైనా నాకు న్యాయం జరుగుతుందని భావించానని అన్నారు. వారం క్రితం ప్రజావాణిలో కూడా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి తన గోడు వెల్లబోసుకున్నానని, ఇప్పటికీ డబ్బులు రాలేదని జగన్‌మోహన్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. మన ఊరు..మన బడి పథకంలో భాగంగా పాఠశాల అభివృద్ధి పనులు చేయించారని అన్నారు. ఈ పనులు తమకు సంబంధం లేదని, పాఠశాల అభివృద్ధి కమిటీ చేయాలని చెప్పినప్పటికీ గ్రామ కార్యదర్శి నుంచి కలెక్టర్ వరకు సర్పంచ్‌లపై తీవ్రమైన ఒత్తిడి చేశారని ఆరోపించారు. దీంతో తమ వద్ద డబ్బులు లేకపోవడంతో అప్పులు చేశామని, ఇంట్లో బంగారం, ఎకరాల భూమి అమ్ము కున్నామని వాపోయారు. అప్పులు ఇచ్చినవారు అప్పు తీర్చాలని తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, మంత్రుల చట్టు తిరిగినా బిల్లులు మంజూరు చేయడం లేదన్నారు. విసిగి వేసారి చివరకు కలెక్టర్ ఎదుట ఆత్మహత్యకు యత్నించానన్నారు. జిల్లాలోని అనేక మంది మాజీ సర్పంచులకు, ఏఎంసీ డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు కూడా మన ఊరు..మన బడి అభివృద్ధి పనులు చేసి బిల్లుల కోసం పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు న్యాయం చేసి వెంటనే బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని జగన్‌మోహన్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.


జగన్‌మోహన్‌గౌడ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

'ప్రజావాణి'కి మందుడబ్బాతో వచ్చిన బాధితుడు

సుభాష్‌నగర్:అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా తన సమస్య పరిష్కారం కావడం లేదని ఓ బాధితుడు పురుగుల మందు డబ్బా తో ప్రజావాణికి వచ్చాడు. అయితే పోలీసుల తనిఖీలో ఆయన వద్ద పురుగుల మందు డబ్బా ఉందని గుర్తించి దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు ఒగ్గు రాజమల్లు మాట్లాడుతూ తాను గంగాధర మండలం, సర్వారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వాడనని, తనకు గ్రామంలో 58 సర్వే నంబ రులో 24 గుంటలు, 59 సర్వే నంబరులో 26 గుంటల భూమి, 447లో 22 గుంటల భూమి ఉందని తెలిపారు. 2005లో కొంత భూమిని తన తండ్రి నుంచి విరాసత్ ద్వారా పొందినట్లు చెప్పారు. ఆ భూమిని తానే సాగు చేస్తున్నానని తెలిపారు. అయితే ఈ భూమిని తాను కాని, తన కుటుంబ సభ్యులు కానీ ఎలాంటి క్రయ విక్రయాలు చేయలేదన్నారు. అయితే పట్టా భూమి పొరపాటున ఇతరుల పేరున ధరణి పోర్టల్‌లో నమోదు అయిందని తెలిపారు. దానిని సరి చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదన్నారు. ధరణిలో అక్ర మంగా తన భూమిపై ఉన్న ఇతరుల పేరును వెంటనే తొలగించాలని కోరారు. తమ సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం 1వ టౌన్ సీఐ సరిలాల్ రాజమల్లు దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం రాజమల్లు కలెక్టర్ పమేలా సత్పతికి దరఖాస్తు అందజేసి వెళ్లిపోయారు.


ఒగ్గు రాజమల్లు దంపతులు

కొనసాగుతున్న ఎన్టీపీసీ స్పోర్ట్స్ మీట్

జ్యోతినగర్, జులై 8 : రామగుండం ఎన్టీపీసీలో దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్ రెండోరోజు సోమవారం ఉత్సాహంగా కొనసాగింది. ఎన్టీపీసీ పీటీఎస్ స్పందన ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న బ్యాడ్మింటన్ పోటీలలో రెండో రోజు సింహాద్రి ఎన్టీపీసీ మహిళల జట్టు లీగ్ మ్యాచుల్లో విజయం సాధించింది. మహాత్మాగాంధీ స్టేడియంలో జరిగిన క్రికెట్ లీగ్ మ్యాచుల్లో ఎస్‌ఆర్‌హెచ్‌క్యూ(హైదరాబాద్) వల్లూర్ ప్రాజెక్టు జట్టుపై 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో సింహాద్రి ఎన్టీపీసీ జట్టు కుడిగి ఎన్టీపీసీ జట్టుపై 13 పరుగుల తేడాతో గెలుపొందింది. ఎన్టీపీసీ సదరన్ స్పోర్ట్స్ మీట్ బుధవారం ముగుస్తుంది.

వ్యవసాయ బావిలో మహిళ మృతదేహం

హత్య చేసి బావిలో పడేశారని అనుమానం

ముత్తారం, జూలై 8: ముత్తారం మండలంలోని వ్యవసాయ బావిలో ఓ మహిళ మృతదేహం కనిపించింది. గోనే సంచిలో మృతదేహం మూట కట్టి ఉండడంతో ఆమెను ఎవరో హత్య చేసి మూటగట్టి బావిలో పడేశారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఘటన మూడు రోజుల క్రితం జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మండలంలోని ముత్తారం నుంచి పారుపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో గల ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో సోమవారం మూట కట్టి ఉన్న గోనె సంచి నీళ్ల పైకి తేలి దుర్వాసన రావడంతో అటువైపుగా వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. తాడుతో కట్టి ఉన్న గోనసంచి మూటను పైకి తీయించి పరిశీలించగా అందులో ఒక మహిళ మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న మంథని సీఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకున్నారు. ఆ మృతదేహం ఎవరిది అనే విషయమై పోలీసులు ఇంకా గుర్తించలేదు. ఇటీవల ఒక మహిళ అదృశ్యం అయినట్లు గోదావరిఖని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో ఆ మహిళ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కానీ ఎవరూ గుర్తించలేకపోయారు. ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని మృతదేహం ఎవరిదని గుర్తించలేదన్నారు.

బీఎస్ఎన్ఎల్‌లో 4జీ సేవలు

భగత్‌నగర్, జూలై 8: ఉమ్మడి జిల్లాలో 4జీ సెల్ సైట్లను విజయవంతంగా ఏర్పాటు చేశామని కరీంనగర్ జిల్లా డిప్యూటి జనరల్ మేనేజర్ దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో స్వదేశీ పరిజ్ఞానంతో బీఎస్ఎన్ఎల్ 4జీ మొబైల్ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ప్రస్తుతం 2జి/3జి సిమ్‌లను 4జీ/5జీ సిమ్‌లకు అప్‌గ్రేడ్ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ మొబైల్ చార్జీలను పెంచే యోచన లేదన్నారు. బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్‌తో మెరుగైన ఇంటర్నెట్ సేవల అనుభూతి పొందాలని, ఆర్‌సి 249 అన్‌లిమిటెడ్ కాల్స్, 2జిబి డాటాను 45 రోజుల పాటు అందిస్తున్నామన్నారు.

భీవండి నుంచి జగిత్యాలకు మద్యం సరఫరా

- 11 మద్యం బాటిళ్లతో పాటు ద్విచక్ర వాహనం సీజ్
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ సీఐ


నిందితులను అరెస్టు చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

జగిత్యాల టౌన్, జూలై 8 :మహారాష్ట్రలోని భీవండి నుంచి జగిత్యాలకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురు వ్యక్తులను జగిత్యాల ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద 11 మద్యం బాటిళ్లతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. జగిత్యాల ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ పూర్తి వివరాలు వెల్లండించారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామానికి చెందిన నడిమెట్ల రాజు, కొడిమ్యాల అనీల్‌లు టాక్సీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల బీవండి ప్రాంతానికి టాక్సీ కిరాయి వెళ్లి అక్కడ ఇంపీరియల్ బ్లూ కంపెనీకి చెందిన 11 మద్యం బాటిళ్లను రూ. 300 చొప్పున కొనుగోలు చేశారు. వాటిని జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో కర్రీ పాయింట్ నిర్వహించే చంద్రమౌళికి రూ. 650 చొప్పున విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం కరీంనగర్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్, జగిత్యాల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ ఆదేశాల మేరకు సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు పొలాసలో ఉన్న కర్రీ పాయింట్‌పై దాడులు చేయగా 11 మద్యం బాటిళ్లు ఇతర ప్రాంతం నుంచి తీసుకవచ్చి విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ రాజమౌళి, ఎస్సై స్వప్న, సిబ్బంది గట్టయ్య, మోహన్ లాల్, చందు, కిషోర్, రమేష్, సంతోష్ ఉన్నారు.

విడుదల కాని 'అమ్మ ఆదర్శ పాఠశాల'ల బిల్లులు

● అప్పులు తెచ్చి పనులు చేసిన మహిళా సంఘాల సభ్యులు


గొల్లగూడెం పాఠశాలలో చేస్తున్న మరమ్మతు పనులు(ఫైల్)


ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో చేస్తున్న మరమ్మతు పనులు (ఫైల్)

సైదాపూర్, జూలై 8: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని భావించిన ప్రభుత్వం మరమ్మతు పనులను మహిళా సంఘాల ఆధ్వర్యంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనులు గుర్తించి అన్ని గ్రామాలలో ఆయా గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షురాళ్ల(వీవో)కు అప్పగించింది. మహిళలు ఎంతో ఉత్సాహంతో అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశారు. కానీ 25శాతం నిధులు మాత్రమే ఇప్పటి వరకు విడుదలయ్యాయని మహిళలు తెలుపుతున్నారు. ప్రభుత్వం త్వరగా నిధులు విడుదల చేస్తుందనే ఉద్దేశ్యంతో బంగారం తాకట్టుపెట్టి, అప్పులు తెలిచ్చి పనుల చేస్తే ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి అమ్మ ఆదర్శ పాఠశాల పనుల నిధులను వెంటనే విడుదల చేయాలని వీవోలు వేడుకుంటున్నారు. ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించి మరిన్ని పథకాలలో భాగస్వామ్యం చేయాలని, నిధుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలని కోరుతున్నారు.

అప్పులు తెచ్చి మరమ్మతు పనులు చేశాం

- రజిత, వీవో అధ్యక్షురాలు, సైదాపూర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అప్పులు తెచ్చి మరమ్మతు పనులు చేపట్టాం. పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 25శాతం నిధులు మాత్రమే విడుదలయ్యాయి. ఇంకా 75శాతం నిధులు విడుదల కాలేదు. నిధుల మంజూరుకు ఆలస్యం అయితే అప్పుల పాలయ్యే అవకాశముంది. ప్రభుత్వం త్వరితగతిన నిధులు మంజూరు చేయాలి.

కళలతో మానసిక ప్రశాంతత



కేక్ కట్ చేస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 8: కళలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓ సమావేశ మందిరంలో అల్ఫోర్స్ కల్చరల్ ఫీయిస్టా వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడానికి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. ప్రత్యేకంగా పుట్టిన రోజు వేడుకను పండుగ వాతావరణం ఉట్టిపడేలా ఆనందం, ఆప్యాయతతో కళోత్సవాల మధ్య నిర్వహించుకోవడం శుభపరిణామన్నారు. విద్యార్థుల కేరింతల మధ్య కేక్ కట్ చేసి, వివిధ పరీక్షల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యులు పలు యాజమాన్యాలు అల్ఫోర్స్ అధినేతకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

'అల్ఫోర్స్' చైర్మన్‌కు సన్మానం

కరీంనగర్ టౌన్, జూలై 8: అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ స్టేట్ రెడ్డి యూత్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేముల సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, అనితరెడ్డి, రమేశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదవులు కాదు.. ప్రజల సంక్షేమమే ముఖ్యం

కరీంనగర్ అర్బన్, జూలై 8: పదవులు ముఖ్యం కాదు.. ప్రజల సంక్షేమమే ముఖ్యమని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. మేయర్ సునీల్‌రావు ఇటీవల చేసిన విమర్శలకు స్పందనగా ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ మా కుటుంబం, మా నాన్న నీతి, నిజాయితీ, నిబద్ధతకు మారుపేరనే సంగతి కరీంనగర్‌లో ఎవరిని అడిగినా చెప్తారని పేర్కొన్నారు. సునీల్‌రావు రాజకీయ ప్రవేశం ఎలా మొదలైందో, ఆయనకు ఎవరు మద్దతిచ్చారో తెలుసుకోవాలని గుర్తు చేశారు. ఆరోజు తాము అండగా నిలబడకపోతే ఇవాళ ఆయన ఎక్కడ ఉండేవాడో ఆలోచించుకోవాలన్నారు. సునీల్‌రావు కరీంనగర్ లోనే పెద్ద శ్రీమంతుడు కావాలని సింగిల్ పాయింట్ ఎజెండాగా కనిపిస్తోందన్నారు. స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతిపై శిక్షను ఎదుర్కోవడానికి మేయర్ సిద్ధంగా ఉండాలని రాజేందర్‌రావు అన్నారు.

జిల్లా పేరు మార్చాలన్న వ్యాఖ్యలను ఖండిస్తూ బీఆర్ఎస్ నిరసన

గణేశ్‌నగర్, జూలై 8: కరీంనగర్ జిల్లా పేరును మార్చి అంబేద్కర్‌నగర్ చేయాలని కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు చేసిన ప్రకటనను తీవ్రంగా ఖండిస్తు బీఆర్ఎస్ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణచౌక్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ కో ఆప్షన్ మెంబర్ ఎండి జమీలుద్దీన్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు ముస్లిములు, అంబేద్కరిస్టుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలో భాగమేనన్నారు. సెక్యులర్ పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ వెంటనే రాజేందర్‌రావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, షౌకత్, షబీర్, మాజిద్, నిజామ్, సోహెల్, బాబా పాల్గొన్నారు.

ఎవరి మనోభావాలు దెబ్బతీయాలని కాదు

-కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, జూలై 8: కరీంనగర్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని తాను స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులతో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడింది ఎవరి మనోభావాలను దెబ్బతీయాలనేది తన అభిమతం కాదని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీ సోదరులు ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. కరీంనగర్‌కు ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. ఆ పదాన్ని వెనక్కి తీసుకున్నట్లు వెలిచాల రాజేందర్‌రావు ప్రకటించారు.

విద్యుత్ శాఖలో ప్రజావాణికి 12 ఫిర్యాదులు

గణేశ్‌నగర్, జూలై 8: విద్యుత్ శాఖలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 12 ఫిర్యాదులు వచ్చాయని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. విద్యుత్తు వినియోగదారుల కోసం టీజీఎస్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రజావాణిలో వచ్చిన వినియోగదారుల దరఖాస్తులను స్వీకరించి వాటిని తక్షణమే పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ విద్యుత్తు ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ ఆఫీస్‌లో 3 దరఖాస్తులు, కరీంనగర్ టౌన్ 2, కరీంనగర్ రూరల్‌లో4, హుజూరాబాద్ డివిజన్‌లో మూడు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ విజేందర్‌రెడ్డి, ఏడీ స్వప్న, సురేష్ కుమార్ వీణ, తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్ బాలుర పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

మానకొండూర్, జూలై 8 : మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా పదో తరగతి గదిలోకి ఎమ్మెల్యే వెళ్లారు. అదే సమయంలో విద్యార్థులకు హిందీ పాఠాన్ని ఉపాధ్యాయురాలు బోధిస్తున్నారు. ఆయన విద్యార్థులను పాఠం చదవాలని కోరారు. విద్యార్థులకు చదవడం రాకపోవడంతో పదో తరగతి విద్యార్థులకు చదువు రాకపోతే ఎలా ఉత్తీర్ణత సాధిస్తారని హిందీ ఉపాధ్యాయురాలుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రారంభం అయి 20 రోజులు దాటినా ఒక్క పాఠం పూర్తి కావడంపై అసంతృప్తి చెందారు.

హుస్సేన్‌ను వెంటనే విడుదల చేయాలి

జమ్మికుంట, జూలై 8: మాజీ మావోయిస్టు, రచయిత మహ్మద్ హుస్సేన్‌ను ఆయన ఇంటి నుంచి పోలీస్‌లు దౌర్జన్యంగా తీసుకు వెళ్లడం సరికాదని, వెంటనే విడుదల చేయాలని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్ జీవన్‌కుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్యలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కుటుంబ సభ్యులకు కూడా సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి లాక్కెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. గత పదిహేను సంవత్సరాలుగా హుస్సేన్ సాధారణంగా చట్టబద్ధ జీవితం గడుపు తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పాలకులు పోలీస్‌ల దౌర్జన్యాన్ని అరికట్టి తక్షణమే విడుదల చేయాలన్నారు.

● హుజూరాబాద్: ఎలాంటి అరెస్టు వారెంట్ లేకుండా మఫ్టీలో వచ్చిన పోలీసులు రచయిత మహ్మద్ ముజాహిద్ హుస్సేన్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లడం తీవ్రంగా ఖండిస్తున్నామని జనసాహితి సాహిత్య సంస్థ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హుస్సేన్‌పైన ఏదైనా కేసు ఉంటే అరెస్టు వారెంట్ జారీ చేసి, కుటుంబ సభ్యులకు తెలిపి, చట్టబద్ధంగా అదుపులోకి తీసుకోవాల్సిన పోలీసులు, అప్రజాస్వామిక పద్ధతుల్లో హుస్సేన్‌ను కిడ్నాప్ చేయడం అభ్యంతరకరమన్నారు.

అల్ఫోర్స్‌లో బెలూన్ డే వేడుకలు

రామడుగు, జూలై 8: మండలంలోని గోపాలరావుపేటలోని అల్ఫోర్స్ పాఠశాలలో సోమవారం బెలూన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నరేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు.



బెలూన్ డే వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మానకొండూర్, జూలై 8 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానకొండూర్‌లోని తహశీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేసి తహశీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపిఎం నాయకులు శ్రీరాముల నారాయణ, రాయికంటి శ్రీనివాస్, వడ్ల రాజు, లంబు సంపత్‌రెడ్డి, మడుపు రవి ఉన్నారు.

● శంకరపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శంకరపట్నం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇమ్మడి చక్రపాణి, విజయ రాములు, యుగంధర్, తిరుపతి, బుచ్చయ్య, అయిలయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షిత నీటిని అందించాలి

కరీంనగర్ టౌన్, జూలై 8: నగర ప్రజలకు వర్షాకాలంలో సురక్షిత తాగునీటిని అందించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలంలో కొత్తనీరు వచ్చి చేరే అవకాశమున్నందున నీటి శుద్ధి ప్రక్రియలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సోమవారం ఆయన మానేరు డ్యాం సమీపంలోని నగరపాలక సంస్థ నీటి శుద్ధీకరణ కేంద్రం (ఫిల్టర్‌బెడ్)ను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఫిల్టర్‌బెడ్‌లోని 34,14, మిషన్ భగీరథ 36 ఎంఎల్‌డి శుద్ధీకరణ ప్లాంట్లతోపాటు క్లోరినేషన్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. 84 ఎంఎల్‌డీ నీటి శుద్ధికరణ కేంద్రంలోని విద్యుత్ మోటార్లను, ఇతర పరికరాలను పరిశీలించి నీటి శుద్ధికరణ ప్రక్రియ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ నగరంలో మంచినీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండా స్టాండ్ బై మోటార్లను, జనరేటర్లను వినియోగించాలన్నారు. చెడిపోయిన విద్యుత్ మోటారు పంపుసెట్లకు మరమ్మ తులు చేయించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎల్ఎం డీలో కేవలం 5 టీఎంసీల నీటి నిలువలు ఉన్నందున ప్రజలకు రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నా మన్నారు. 8 టీఎంసీల నీరు వచ్చిన తర్వాత మళ్లీ ప్రతి రోజు మంచినీటిని నగర ప్రజలకు అందిస్తామని మేయర్ సునీల్‌రావు స్పష్టం చేశారు. త్వరలో 24 గంటల మంచినీటి సరఫరాలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన హౌజింగ్‌బోర్డు కాలనీలో 24/7 నీటి సరఫరాను ప్రారంభించి దశలవారిగా నగరమంతటా నిరంతర నీటిని అందిస్తామని ప్రకటిం చారు. ఈ కార్యక్రమంలో డీఈఈ లచ్చిరెడ్డి, ఫిల్టర్‌బెడ్ ఇన్‌చార్జి అజయ్, ఏఈ గట్టుస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఫిల్టర్‌బెడ్‌లోని విద్యుత్ పరికరాలను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

'ఎస్ఐ శ్రీనివాస్‌ది కుల వివక్ష హత్య'

సుభాష్‌నగర్, జూలై 8: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్‌ది ఆత్మహత్య కాదని, కుల వివక్ష హత్య అని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి మహేశ్ ఆరోపించారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీరాముల శ్రీనివాస్‌ను అవమాన పరచిన కానిస్టేబుల్స్ శేఖర్, శివనాగరాజు, సుభాని, సన్యాసినాయుడు, సీఐ జితేందర్‌రెడ్డిలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై విచారణ జరిపించి, దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖలోనే కుల వివక్ష ఉంటే ఇక సామాన్యుడి పరిస్థితి ఏమటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాడే శంకర్, ఎలుగ ఆంజనేయులు, తాళ్ళ వెంకటేశ్, దామెర సత్యం, చిగిరి శ్రీధర్, గరిగె ప్రభాకర్, బైరం కుమార్, సానాది వెంకటేష్, తళారి సుధాకర్, గోపాల భూషన్‌రావు, నాయిని ప్రసాద్, నల్లాల శ్రీనివాస్, చిగిరి రవీందర్, కత్తెరమల్ల కిష్టస్వామి, గంటల రేణుక, కోడి పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నడ్డి విరుస్తున్న ప్రైవేట్ మొబైల్ సంస్థలు

సుభాష్‌నగర్, జూలై 8: ప్రైవేటు మొబైల్ సంస్థలు ప్రజల నడ్డి విరుస్తున్నాయని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి సత్తయ్య అన్నారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు తమ టారిఫ్ పెంపుదలతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మోపాయన్నారు. ప్రజలను కాపాడడానికి బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వరంగ సంస్థకి 4జీ, 5జీ సర్వీసులను తక్షణమే కలిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'అద్విత'లో మాక్ పోలింగ్

కరీంనగర్ టౌన్, జూలై 8: నగరంలోని భగత్‌నగర్ అద్విత ఇంటర్నేషనల్ పాఠశాలలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన విద్యార్థుల ఎన్నికల పర్వం ఆకట్టుకుంది. సోమవారం పాఠశాలలో విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువ, ఓటును వినియోగించుకునే విధానం చిన్నారులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా ఎన్నిక లను నిర్వహించారు. ఎన్నికల్లో విజేతలుగా పాఠశాల హెడ్‌గర్ల్ సఫా ఫాతిమా, హెడ్ బాయ్ వై.విశ్వక్సేన్, డిప్యూటీ హెడ్ గర్ల్ పి.రిష, డిప్యూటీ హెడ్‌బాయ్ వి.శ్రేయాస్, టోపాజ్ హౌస్ కెప్టెన్ యశస్విన్, ఎమరాల్డ్ హౌజ్ కెప్టెన్, టి.సాన్వి, సాఫైర్ హౌజ్ కెప్టెన్ సిరివెన్నెల, స్పోర్ట్స్‌మినిస్టర్ రుతేష్, క్రమశిక్షణా కమిటీ మినిస్టర్ సుశాక్‌లు ఎన్నికల్లో విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సౌగాని అనుదీప్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా శాకాంబరి ఉత్సవాలు

కరీంనగర్ రూరల్, జూలై8: కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గ భవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి, వేద పండితులు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆషాడ శాకాంబరి ఉత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారిని క్యాప్సికమ్ మాలలతో అలంకరించారు. ఆలయ ప్రధానాచర్యకులు పవనకృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్ పాల్గొన్నారు.

'ఇంటింటా ఇన్నోవేటర్'ను సద్వినియోగం చేసుకోవాలి

సుభాష్‌నగర్, జూలై 30: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి మొదలు రైతులు, గృహిణీలు, యువకులు, ఇలా ప్రతి ఒక్కరికి అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. సొంతంగా చేసిన ఆవిష్కరణలను పంపించాలని సూచించారు. వివరాలు 9100678543 నంబరుకు వాట్సప్ పంపించాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఆగస్టు 3 లోగా పంపించాలని పేర్కొన్నారు. ఎంపిక చేసి స్వాతంత్ర దినోత్సవం రోజున ప్రదర్శిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, హుజూరాబాద్ ఆర్‌డీవో రమేశ్‌బాబు, ఏవో సుధాకర్, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లావైద్యఆరోగ్యశాఖ అధికారి సుజాత ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, జూలై8: మధ్యాహ్న భోజన కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకు మల్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్, జిల్లా విద్యాధికారికి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం 26వేలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి బెజ్జంకి కాళిదాసు, వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రజిత, జిల్లా నాయ కులు కత్తెర పద్మ,మామిడి మమత, గడ్డం నాగమ్మ, ఎండి సాజన్, గంగారవేణి బాలవ్వ పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

యువజన, క్రీడాశాఖలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, జూలై 8: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం, జిల్లా యువజన, క్రీడాశాఖలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకొని డీవైఎస్‌వోను తొలగించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

81 జీవోను అమలు చేయాలి

జీవో నెంబరు 81ని అమలు చేయాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏలు రాష్ట్ర వ్యాప్తంగా 20,555 మంది ఉన్నారని తెలిపారు. వారిలో రెండు వర్గాలుగా గుర్తించారని తెలిపారు. 61 సంవత్సరాలలోపు ఉన్నవారు 16,757 మందిని రెగ్యులరైజ్ చేశారని, ఇంకా 3,797 మంది వారసులకు, కారుణ్య నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

●సీనియర్ సిటిజన్‌ను దూషించిన కరీంనగర్ అర్బన్ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

●కోర్టు ధిక్కరణకు పాల్పడిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని అల్గునూరుకు చెందిన పిల్లి లక్ష్మి కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

●ప్రైవేటు స్కూల్స్ ఫీజులు తగ్గించాలి, టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలని సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

ఫార్మసీ భూములను రక్షించాలి

కరీంనగర్ అర్బన్: మానేరు జలాశయం వద్ద ఫిల్టర్ బెడ్ భూములను, శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలకు చెందిన భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని యువజన కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్ అమీర్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

●కరీంనగర్ రూరల్: బొమ్మకల్ గ్రామంలోని ప్రభుత్వ భూమిలో కొందరికి పట్టాలిచ్చినప్పటికి మోకాపై స్థలాలు చూపించలేదని ఇట్టి స్థలాలను రియల్ వ్యాపారులు అమ్మేందుకు ప్రయత్నం చేస్తున్నారని అంబేద్కర్ సంఘం రాష్ట్ర కన్వీనర్ గోష్కిశంకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి శ్రీనివాస్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, జూలై 8: ఆరోగ్యశ్రీ సృష్టికర్త, అభాగ్యుల ఆరోగ్య ప్రదాత వైఎస్సార్ అని, ఆయన సేవలు మరువలేనివని మానకొండూరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని సోమవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పురుమళ్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిలతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ ఫీజురీఎంబర్స్‌మెంట్ పథకం ద్వారా విద్యార్థులకు చేయూత అందించారన్నారు. ముఖ్యమంత్రిగా మొట్టమొదటి సంతకంతోనే రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసి రైతు పక్షపాతిగా నిలిచిపోవడం గొప్ప విషయమన్నారు. అనంతరం నగరంలోని పద్మనగర్‌లో భవిత వృద్ధుల ఆశ్రమంలో జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. డీసీసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పులి ఆంజనేయులు గౌడ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, మడుపు మోహన్, శ్రావణ్ నాయక్, చర్ల పద్మ, సమద్ నవాబ్, అహ్మద్ అలీ, పడిశెట్టి భూమయ్య, వెన్న రాజ మల్లయ్య, బొబ్బిలి విక్టర్, కాంరెడ్డి రాంరెడ్డి, ముస్తాక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కుర్ర పోచయ్య, నాగుల సతీష్, వంగల విద్యాసాగర్, కల్వల రామచందర్, కంకణాల అనిల్‌కుమార్‌గుప్తా, దీకొండ శేఖర్, నూనె గోపాల్‌రెడ్డి, రామిడి రాజిరెడ్డి, దన్నూ సింగ్, షబానా మహమ్మద్, వెన్నం రజిత, హస్తపురం రమేష్, నెల్లి నరేష్, హస్తపురం తిరుమల, హసీనా, దామోదర్, మాదాసు శ్రీనివాస్, బత్తిని చంద్రయ్య గౌడ్, ములకల కవితా యోనా, సిరిపురం నాగప్రసాద్, పర్వత మల్లేశం పాల్గొన్నారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వంగ రామకృష్ణ, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

● గన్నేరువరం: దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుర్ర శ్రీకాంత్, బుర్ర తిరుపతి, నల్ల చంద్రారెడ్డి, రాజయ్య, కొమురయ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో ఎంపీటీసీల సేవలు మరువలేనివి

మానకొండూర్, జూలై 8: గ్రామాల అభివృద్ధిలో ఎంపీటీసీల సేవలు మరువలేనివని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు అన్నారు. మానకొండూర్‌లోని పార్టీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో సోమవారం సన్మాన కార్యక్రమం ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని కార్యకర్తలకు ఎల్లవేలలా అందుబాటులో ఉంటానని అన్నారు. అనంతరం ఎంపీటీసీలను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎరుకల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

హుజూరాబాద్, జూలై 8: హుజూరాబాద్ డివిజన్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు అన్నారు. సోమవారం హుజూరాబాద్ డివిజన్‌లోని పలు ప్రైవేట్ ఆస్పత్రు లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టు 2010 నిబంధనలకు లోబడి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆస్పత్రిలోని డాక్టర్ల వివరాలను, సిబ్బంది వివరాలను, సేవల వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు కూడా పెడతామన్నారు.

పాడి రైతులను మోసం చేస్తున్న డెయిరీలు

గన్నేరువరం, జులై 8: మండలంలోని వివిధ గ్రామాలలో పాడి రైతులను డెయిరీలు మోసం చేస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని మండల సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పాలకేంద్రం వద్ద సోమవారం సీపీఐ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాలకేంద్రం నిర్వాహకులు తక్కువ రేటుకు రైతు వద్ద పాలను కొనుగోలు చేసి దోచుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి చొక్కల శ్రీశైలం, నాయకులు గర్శకుర్తి శ్రీనివాస్, మొలుగూరి ఆంజనేయులు, బోయిని మల్లయ్య ఉన్నారు.

సెయింట్ జార్జ్ విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, జూలై 8: ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్‌రికార్డ్స్‌లో సెయింట్‌జార్జ్ (సిబిఎస్ఈ) విద్యార్థులు చోటు సంపాదించారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న పి సుశీల్‌కుమార్, హనియా, భరత్‌కుమార్, సిరి, దీక్షిత, రిత్విక్, అద్వికానాథ్, వర్షిత, వైష్ణవి, తొమ్మిది మంది విద్యార్థులు ప్రతిభకనబరిచి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సంపాదించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ అందించిన ఉపాధ్యాయురాలు ఫాతిమాను అభినందించారు.

ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయించండి

కరీంనగర్ టౌన్, జూలై 8: జిల్లాలో కార్మికుల ఆరోగ్య ప్రయోజనాల కోసం ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయించాలని బిఆర్‌టియు అనుబంధ సంఘమైన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర మంత్రిని కోరారు. ఈమేరకు సోమవారం కరీంనగర్‌లో యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎల్.రూప్‌సింగ్ ఆధ్వ ర్యంలో యూనియన్ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను సత్కరించారు.కార్యక్రమంలో బీఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు దావు రాజమల్లయ్య, టౌన్ అధ్యక్షుడు గడ్డం సంపత్, శ్రీనివాస్, ఎల్లయ్య, రాజేందర్, రాజేశ్ భద్ర తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కరీంనగర్ అర్బన్, జూలై 8 : కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా కరీంనగర్ మండల్ బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని రజ్వీచమన్‌కు చెందిన మహమ్మద్ కలీంను నియమించారు. ఈ మేరకు నగరశాఖ కార్యాలయంలో నియామక పత్రం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండీ తాజుద్దీన్ చేతుల మీదుగా ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జూలై 8: నగరంలో మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టూ ఏడీఈలు సాయినేని నరేందర్, సుధీర్ కుమార్‌లు తెలిపారు. తెలంగాణ చౌక్ ఫీడర్ పరిధిలో మహిళా డిగ్రీ కళాశాల కాశ్మీర్‌గడ్డ, ముఖ్రాంపుర, ప్రాంతాలలో నిలిపివేస్తున్నట్లు తెలిపారు. గంజి, వెంకట్ సాయి, ఫీడర్‌లో భాగం కమాన్ నుంచి హౌసింగ్ బోర్డు రోడ్డు,లక్ష్మీనగర్‌లో కొంత భాగం, వాసవి కాలనీ, రాఘవేంద్రనగర్, వందన అపార్ట్ మెంట్ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పోస్టల్ బీమాను సద్వినియోగపరచుకోవాలి

కరీంనగర్ రూరల్, జూలై8: పోస్టల్ శాఖ, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఆధ్వర్యంలో అందిస్తున్న పోస్టల్ బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి డివిజన్ ఐపీపీబీ సినియర్ మేనేజర్ శ్రీనివాస్ గ్రామస్తులను కోరారు. సోమవారం మండలంలోని మొగ్దుంపూర్ గ్రామంలో పోస్టల్‌బీమాపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం టి.రాజశేఖర్, బీపీఎంలు కె.ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, రవి, మాజి సర్పంచ్‌లు జక్కం నర్సయ్య, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువు దుకాణాల్లో తనిఖీలు

కరీంనగర్ రూరల్, జూలై8: మండలంలోని చెర్లబూత్కూర్‌లోని కరీంనగర్ సొసైటీ గోదాం, దుర్శేడ్ సహకార సంఘం, నగునూర్‌లోని ఆగ్రోస్ కేంద్రం, వల్లంపహడ్, మొగ్దుంపూర్‌లోని ఎరువుల దుకాణా లను సోమవారం మండల వ్యవసాయాదికారి బి.సత్యం తనిఖీలు చేశారు. ఎరువులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవడం కోసం తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు.

ఆల్ ఇండియా రెడ్డి సంఘం జిల్లా కమిటీ రద్దు

కరీంనగర్ టౌన్, జూలై 8: ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా కమిటీని రద్దు చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో కొత్త కమిటీని నియమించి, సంఘాన్ని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని అన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ కల్చరల్: నగరంలోని అంజనాద్రి కాలనీకి చెందిన మహిళలు ఆషాఢమాసం సందర్భంగా సోమవారం కాలనీ వేల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాల్లో పాల్గొన్నారు.

●ఈ నెల 13, 14, 15 తేదీల్లో విద్యానగర్ పెద్దమ్మతల్లి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే పెద్దమ్మతల్లి బోనాల జాతరకు రావాలని సోమవారం మేయర్ సునీల్‌రావుకు ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వాహకులు ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవా ధ్యక్షుడు గుర్రాల మల్లేశం, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కంకటి రాజారాం, చొప్పరి అంజయ్య, పండుగ నాగరాజు పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందతుండగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంజూరు చేసిన రూ. 2.50లక్షల ఎల్వోసీని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు.

● హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందిన పద్మశాలి కుటుంబాలకు టీఆర్ఎస్ జిల్లా కో కన్వీనర్ చిలుకమారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు ఆర్థిక సహాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. కోమటి రాజేశ్వరికి రూ. 5 వేలు, కోమటి కనకమ్మకు రూ.5 వేలు, సబ్బని లక్ష్మీకి రూ.5 వేలు అందించారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ వైద్యుల శిరీష తండ్రి ముకుందరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని సోమవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పరామర్శించారు.

● వీణవంక : మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అబ్దుల్ షకీల్ మృతి చెందగా వారి కుటుంబాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ పరామర్శించారు. మామిడాలపల్లిలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు.

- వీణవంక మండలంలోని నర్సింగాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హరిహర క్షేత్రం సభ్యులు బుక్స్, పెన్నులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంగాడి రాజిరెడ్డి, చింతల శ్రీనివాస్‌రెడ్డి, చింతల నర్సింహారెడ్డి,చింతల చంద్రారెడ్డి తదితరులున్నారు.

- వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దాదాపు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసి అనంతరం పదవ రోజు పీరీలను నిమజ్జనం చేస్తారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పదవి ముగిసిన ఎంపీటీసీలకు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ ఉమ్మెంతల సరోజన, ఎంపీటీసీ సభ్యులను సన్మానించారు.

● గన్నేరువరం: మండలంలోని చొక్కారావుపల్లి బిక్కవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. రెండు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

● గంగాధర: మండలంలోని నాలుగు గ్రామాల్లో పాతిమానగర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం చేతిపంపులు ప్రారంభించారు. మండలంలోని హిమ్మత్‌నగర్, తాడిజెర్రి, కాసారం, కాచిరెడ్డిపల్లి గ్రామాల్లో బోర్లు వేయించి చేతి పంపులను ఏర్పాటు చేశారు.